# ఆశ్చర్యం!

బస్సు కిటకిట లాడుతోంది, కొత్త సినిమా మొదటి ఆటలాగా. కండక్టరు జనాన్ని లోపలికి తోస్తూనే వున్నాడు, చాకలి బుట్టలోకి మాసిన బట్టలు కూరినట్టు. దిగేవాళ్ళు లేకపోయినా ఎక్కేవాళ్ళని సర్దుతూనే వున్నాడు.

కొండమీద దేవుడి కళ్యాణం. బస్సుల రాకపోక లకి అంతూ పంతూ లేదు. భక్తుల ఇక్కట్లకీ .... తిరిగి వస్తోన్న గుళ్ళకీ కూడా లెక్కా జమా లేదు.

"ఓయ్! ఓయ్!" అంటూ ఒగురుస్తూ పరిగెత్తు కొచ్చాడు షావుకారు.

కదలబోయిన బస్సు కదలలేదు.

షావుకారు ఫుట్‌బోర్డ్ మీద కాలుపెట్టడం...., "రైట్" అంటూ కండక్టర్ అరవడం ...., బస్సు ఒక్క వూపుతో కదలడం, షావుకారు తుళ్ళిపడి నిలదొక్కు కోడం, అన్నీ ఏకకాలంలో జరిగిపోయాయి.

"ఏంటోయ్, మడిసి పూర్తిగా ఎక్కక్కర్లేదా?" అంటూ షావుకారు కొంచెం కోపం చేశాడు కండక్టర్ మీద.

"ఇహిహి ....! లేట్‌లో పోతంది సార్ బండి! ఎల్లండి .... లోపలి కెల్లండి" అంటూ కండక్టరు ఒక మందహాసం విసిరి షావుకార్ని చల్లబరిచాడు. షావు కారు కొట్లో కండక్టర్‌కి వంద రూపాయల పైనే అప్పు ఎకౌంటు వుంది.

షావుకారు రెండో మెట్టుకూడా ఎక్కి వస్తోంటే అప్పలకొండకి దడ పుట్టింది. పాపం అప్పలకొండ నిజంగా నాగేశ్వర్రావులాగే వుంటాడు. అయినా వాళ్ళ మామ్మ మనవడి మంచిచెడ్డలమీద పెత్తనం తీసు కుని, సింహాద్రి అప్పన్నమీద తనకున్న భయభక్తులన్నీ కూడగట్టి, ఆ ముద్దు పేరు పెట్టింది.

పెరిగి పెద్దవాడై కాలేజీలో చదువుతోన్న అప్పల కొండకి, తన పేరులో బొత్తిగా ముద్దు కన్పించలేదు. ఓరోజు అమ్మాయిలు ఫక్కుమని నవ్వుకోడం విని ఇంటికి దూసుకొచ్చి మామ్మమీద విరుచుకుపడ్డాడు.

"అసలు నీకేం హక్కుందే?" అన్నాడు వెళ్ళీ వెళ్ళ గానే. "అసలు నా పేరు నువ్వెందుకు పెట్టావే?" అని గంతులేశాడు.

"ఛా, నోర్ముయ్! అసలు సంగతి చెప్పకండా గంతులూ!"

"నేనేం చెప్పను. నా పేరు మార్చేసుకుంటాను. 'ప్రదీప్' అని పెట్టేసుకుంటాను. 'కిషోర్' అని పెట్టేసు కుంటాను. లేకపోతే అక్కినేని నాగేశ్వర్రావని పెట్టేసు కుంటాను. ఆఁ! అంతే!"

"అయ్యో! అయ్యో! అపచారంరా అప్పన్నా! ఇంకెప్పుడూ అనమాకు."

"అంటాను. అంటాను — నువ్వుకూడా నన్ను సురేష్ అని పిలు. తెలిసిందా? లేకపోతే నేను పల కను."

"ఒరేయ్ అప్పన్నా!"

"ఎందుకూ?"

"లెంపలేసుకో! సింహాద్రి దేవుడికి కోపం జాస్తి! వెర్రి వెర్రి వేషాలేస్తే పరీక్ష పోగొట్టేగల్డు."

హడలిపోయాడు అప్పలకొండ. దీనంగా చూశాడు మామ్మకేసి.

టప టపా లెంపలు వాయించుకున్నాడు.

"పోనీ మామ్మా! ఆపేరే వుంచుకుంటాలేవే పరీక్ష లయ్యేదాకా."

"నాకు చెప్పటం కాదు. దేవుడికి చెప్పరా!" అంది మామ్మ.

బయల్దేరాడు అప్పలకొండ కొండకి. "పోనీలే, 'పేరులో ఏముందీ?' అన్నాడు పెరల్ బక్కే కాబోలు! అందంలో వుందిగానీ..." జేబులో అద్దం తీసి ఒకసారి చాటుగా అందం చూసుకుని ధైర్యంగా బస్సెక్కాడు. అప్పటికి కొంచెం చోటు దొరికింది.

"కొంచెం జరగవయ్యా కుర్రోడా!" అన్నాడు షావు కారు. అంటూనే సగం అప్పలకొండ ఒళ్ళోనే చతికిల బడ్డాడు.

అప్పడంలా అణిగి కెవ్వుమని అరవబోయిన అప్పలకొండ చిరునవ్వే నవ్వుతూ — "ఫర్వాలేదు

లెండి, ఫర్వాలేదు లెండి" అనేసి ఒక్క బెత్తెడు చోటులో ఇరికి నైస్‌గా కాలుమీద కాలేసుకుని సీటు చివర అని పడీపడకుండా సర్దుకున్నాడు.

నిజానికి, గొప్ప త్యాగ ధనం సంపాదించటానికి బస్సు ప్రయాణం చాలనుకున్నాడు అప్పలకొండ.

కండక్టర్, తోసుకుంటూ గెంటుకుంటూ జనాన్ని చీల్చుకుంటూ పద్మవ్యూహంలో జొరబడుతున్న అభిమన్య కుమారుళ్ళా వచ్చాడు.

షావుకారు పర్స్‌తీసి డబ్బులిచ్చాడు.

అప్పలకొండ, దూరంగా సీటులో కూర్చున్న అందమైన ఆడపిల్ల కేసి చూస్తున్నాడు — "అవును. చాలా బ్యూటిఫుల్‌గా వుంది. పేరు 'చారులత.' అయితే బాగుంటుంది లేకపోతే 'జానకి' అయినా బాగానే వుంటుంది. జానీ అని పిలవచ్చు తను. ఈ రోజుల్లో అంతా అలాగే పిల్చుకుంటున్నారు.

బస్సు మళ్ళీ ఆగింది. బిలబిల్లాడుతూ వచ్చి పడ్డారు జనం. చారులతకీ అప్పలకొండకీ అడ్డం నిల్చి అప్పన్న కలలలోకం చెదరగొట్టేశారు జనం! — ఇళ్ళల్లో వుండే వాళ్ళకన్నా బస్సుల్లో వుండే వాళ్ళే ఎక్కువ. బొత్తిగా ఇండియాలో పాప్యులేషన్ పాపంలా పెరిగి పోతోంది. ఛ. ఈ గవర్నమెంటు ఎందుకూ పనికి రాదు. ఆఖరికి మనుషుల్ని కూడా చంపలేదు! తను దిగాక ఈ బస్సుమీద ఒక్క బాంబువేస్తే సరి. అరెరె! జానకి కూడా దిగాలి...........

జనం వస్తూనే వున్నారు. ఎక్కుతూనే వున్నారు.

ఇద్దరు కుర్రాళ్ళు, తోపుళ్ళాటకి షావుకారి ఒళ్ళోపడి సోఫాలో కూర్చున్నట్టు కాస్సేపు కూర్చుని, షావుకారు లబలబలకి లేవక తప్పక లేచారు.

అప్పలకొండకి నవ్వొచ్చింది.

షావుకార్ని చూసి అణుచుకున్నాడు.

బస్సు కదిలింది .... పోతోంది .... పోతోంది ..... పో .... తో...

ఇబ్బందిగా కదిలాడు షావుకారు. చేతులు అటూ ఇటూ వేశాడు.

కెవ్వుమన్నాడు.

అదిరిపడ్డారు బస్సుడు జనం.

"బాబోయ్! నా పర్సు! నా పర్సు! నా పర్సయ్యా!" అంటూ పొలికేకలు పెడుతున్నాడు షావుకారు.

కంగారుతో చిందులు తొక్కాడు. అప్పలకొండ కాళ్ళు విరగదొక్కాడు.

అయినా సహించుకుంటూ అప్పలకొండ చిరునవ్వు నవ్వాడు .... వెధవది. కోపం తెచ్చుకుంటే బాగుండదు. చారులత చూస్తుంది. "వెదకండీ! అదే వుంటుంది. సరిగ్గా చూడండీ!" అన్నాడు ధైర్యం చెప్తూ.

"ఛ! వూరుకోవయ్యా! నీ బోడి సలహా నువ్వూనూ. ఇంకా ఎక్కడ వెదకమంటావ్? ఎవడో కొట్టేశాడు. కాస్త వెతికి పెట్టరాదూ?" అంటూ కస్సుమన్నాడు షావుకారు.

అప్పలకొండ లేచి నుంచున్నాడు. తప్పు గ్రహించుకుని — "వెతికేస్తాను చెప్పండి. ఎక్కడ వెతకను?" అంటూ వీరావేశంతో షావుకారు లాల్చీజేబులో చేతులెట్టి కెలికిపారేశాడు.

అప్పలకొండ చేతులు రెండూ విసిరికొట్టాడు షావుకారు. "అయ్యా! డ్రయివరు గారూ! కాస్త బస్సు ఆపుదూ! నా పర్స్ కనబట్టం లేదయ్యా! ఏవయ్యో కండక్టరూ! వంద రూపాయలపైనే వున్నాయి." ఏడుపు మొదలుపెట్టాడు షావుకారు.

జాలేసింది అప్పలకొండకి.

"ఎవరికన్నా పర్సు దొరికితే ఇచ్చెయ్యండోయ్ బాబూ! షావుకారు మంచి బహుమతి ఇస్తార్లెండి" అంటూ అరిచాడు కండక్టరు.

"దొరకటం ఏంటయ్యా? నేనేం పారేసుకున్నానా? నీకు టిక్కెట్టు డబ్బులిచ్చి జోబీలో పెట్టేసుకున్నాను. చూశావు కదా? ఏ దొంగముండా కొడుకో కాజేసి కూచున్నాడు. నాది నాకివ్వటానికి బగుమతీ ఒకటా, బగుమతీ!" అంటూ గోలపెట్టాడు షావుకారు.

చారులత రుమాలు అడ్డం పెట్టుకుని నవ్వుతోంది.

అదిచూసి అప్పలకొండ కూడా నవ్వు తెచ్చుకున్నాడు. "నువ్వు కూడా నవ్వు తెచ్చుకో" అన్నట్టు షావుకారు కేసి చూశాడు.

"ఏంటయ్యా, నీ ఇకిలింపూ నువ్వూనూ! పర్సుపోయి నే నేడుస్తాంటే .... దొంగ వెధవెవడో ఈ బస్‌లోనే వున్నాడు."

షావుకారు విదిలింపుతో అప్పలకొండ బిక్కమొహం వేశాడు.

షావుకారు మీదనుంచి గుర్రప్పిల్లల్లా లంఘించిన కుర్రవాళ్ళకి షౌరుషాలొచ్చాయి. "మాకేం భయమా?

చూసుకోవయ్యా! నువ్వే చూస్కో!" అంటూ ఉక్కు గుళ్ళలాంటి సంచులు రెండూ షావుకారు పొట్టమీదికి గిరాటెట్టారు. మళ్ళీ ఒక బుట్ట వచ్చి పడింది. వాటి వెనకే ఓ తట్ట వచ్చిపడింది. "వెతుక్కో, వెతుక్కో, బస్సంతా వెతికేసుకో" అంటూ.

ఆశకొద్దీ .... సంతోషంకొద్దీ .... షావుకారు నడ్డి వంచి ఆ సంచులూ, తట్టలూ, బుట్టలూ కెలికి కెలికి పారేశాడు.

అప్పలకొండ కూడా చాలా సాయం చేశాడు. "ఛ! లేనట్టుంది షావుకారుగారూ!" అంటూ నుదురు తడుంకున్నాడు చెమటకోసం.

"ఊహూ! ఉన్నట్టు లేదు" బిక్కమొహం వేశాడు షావుకారు "అయ్యో! అయ్యో! నీళ్ళధారేనా! వంద రూపాయలు! .... వంద రూపాయలు కండక్టరూ! ఏంటీ అన్యాయం?" అంటూ ఘొల్లుమన్నాడు.

షావుకార్ని ఓదార్చటం తన కర్తవ్యం అనుకున్న కండక్టరు తోరణంలా వేళ్ళాడుతున్న జనాన్ని గెంటుకుని .... తోసుకుని .... ఇవతలి ఒడ్డుకి చేరాడు.

"షావుకారుగారూ! మీ రల్లా అధైర్యం పడకండి. దిగేవోళ్ళనందర్నీ సూద్దాం. దేవుడికి మొక్కుకోండి. అదే దొరుకుద్ది."

"అందుకే కాదంటయ్యా కొండకి పోతున్నానూ? దొరికితే ఇస్తానూ, లేకపోతే లేదు. దేవుడికి మాత్రం నేనెక్కడ తవ్వుకు రానూ?" మొండికేశాడు షావుకారు.

"అద్గదీ! ఆ మాటమీదుండండి! దొరికినా పోయినా అది దేవుడి సొమ్మేకదా?"

షావుకారుకి ఏడవాలో నవ్వాలో అర్థంకాలేదు.

అప్పలకొండకి మాత్రం కొంచెం భయం వేసింది. "దేవుడి మొక్కు ఎగ్గొట్టొచ్చునా? అమ్మో! దేవుడేవన్నా చేస్తే? కీచు కీచుమని అరవాల్సిందే?" అనుకున్నాడు.

కండక్టరు ఒక అడుగు వెనక్కివేసి అందరూ చూస్తోండగా చటుక్కున పైకి తొంగిచూస్తోన్న పర్స్ తీశాడు — అప్పలకొండ జేబులోంచి!

తెల్లబోయాడు అప్పలకొండ.

అమాంతం కండక్టర్ని కావలించుకున్నాడు షావుకారు.

"ఉండండి. ఉండండి. ఊపిరాడనివ్వండి" అంటూ పెనుగులాడాడు కండక్టరు.

"అరె! ఎలా దొరికింది?" విస్మయంగా అన్నాడు అప్పలకొండ.

"దొరకదూ? తమరు సరిగ్గా దాచుకోలేదు లెండి" ఛలోక్తి విసిరా రెవరో.

"అదేమిటండీ? నేను తియ్యందే!"

"చాల్లేవయ్యా! నోరు మూసుకో. ఎముకల్లో సున్నం లేకండా తన్నీగల్ను. పక్కన చేరి కూచుని ఇదా నీ ఎత్తు! పైగా నా జేబులో వెతుకుతావా? నాకు సాయం చేసినట్టు నటిస్తావా? నన్ను కంగారు పడొద్దని ఓదారుస్తావా? దొంగ భడవా! .... భడవానీ ...." అంటూ రంకెలు వేశాడు షావుకారు.

బిక్క చచ్చిపోయాడు అప్పలకొండ.

"ఏం ఇచిత్రం. కుర్రోడేమో మెరికలా గున్నాడు. ఎదవబుద్ధి."

"అలా టిప్పుటప్పుగా లేకపోతే ఎవరు దగ్గిర కూకోనిత్తార్లే."

"అయినా ఇండియాలో పిక్‌పాకెట్స్ ఎక్కువై పోయారండీ! గవర్నమెంటలా ఏడుస్తోంది."

"పట్టుమని పద్దెనిమిదేళ్ళుండవు. ఎంత ఒడుపుగా తీశాడయ్యా! మనంకూడా నేర్చుకుంటే బతికి పోతాం."

"అఁ, ఆ పెద్దమనిషి గాబట్టి ఈపు చీరకుండా ఒగ్గేశాడు."

బావురుమని ఏడ్చెయ్యబోయాడు అప్పలకొండ.

కిక్కురుమనకుండా తల దించేసుకున్నాడు.

దేవుడి సాక్షిగా తను పర్సు తియ్యలేదే! అది తన జేబులో కెలా వచ్చింది!

పర్స్ తెరిచి నోట్లు లెక్క పెట్టుకున్నాడు షావుకారు. చెక్కుచెదరలేదు. ఇకిలిస్తూ — అందరికేసీ చూశాడు. పర్సుని గట్టిగా పట్టుకుని, అదిమిపట్టుకుని కూచున్నాడు. పర్స్ దొరికిన సంతోషంతో ఆలోచిస్తోంటే షావుకారుకి కొంచెం అనుమానం ప్రారంభమైంది. ఇందాక కండక్టర్‌కి టిక్కట్టు డబ్బులిచ్చి పర్సు జేబులో పెట్టుకున్నప్పుడు, తన చెయ్యి ఇరుకు జేబులోకి వెళ్ళినట్టు తోచింది సుమా!

అయ్యో! అలా జరిగిందా!

[1965 సెప్టెంబర్ 'జ్యోతి' మాసపత్రికలో]★